# ఇంటర్వ్యూలో కృష్ణారావు

సోమర్సెట్ మామ్ స్వర్గానికి రాగానే అక్కడున్న మహా కవులంతా స్వాగతం చెప్పి పూలదండలు వేసి అమృతంతో ఆతిథ్యమిచ్చారు హోమరు, షేక్స్పియరు, కాళిదాసుల ఆధ్వర్యాన ఒక చిన్న విందు ఏర్పాటు చేయబడింది. అందులో మామ్ చిన్న ప్రసంగం చేశాడు. ఆయన తాను రాబోయేముందు ప్రపంచంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాడు. 'ప్రపంచం రోజు రోజుకూ, పతనోన్ముఖమౌతున్నది లయాత్మకంగా లయోన్ముఖంగా పయనిస్తున్నది' అని చెప్పి తన విచారాన్ని వ్యక్తంచేశాడు. విందు అనంతరం వివిధ కవులంతా ఆయనకు పరిచయం చేయబడ్డారు....వరుసగా భారతదేశానికి చెందిన వివిధ ప్రాంతీయ భాషలలోని అగ్రగణ్యులూ పరిచయం చేయబడుతున్నారు.... 'వీరు నన్నపార్యులు, వీరు పాల్కురికి, వీరు తిక్కనామాత్యులు, వీరు సోమన, ఇరుగో ఎఱ్ఱయ, ఈయన పోతన, వీరు శ్రీనాథులు, ఇరుగో పెద్దన...'వరుసగా అందరికీ అభినందనలు చెబుతూ మామ్ ముందుకు సాగారు.

'వీరు సాహితీ సమరాంగణ సార్వభౌములు శ్రీకృష్ణ దేవరాయలు....' మామ్ విష్ చేసి కరచాలనానికై చేయి చాచారు. రాయలవారు రాచఠీవిలో చిరునవ్వు నవ్వి తల నూగించారేకాని చేతినందీయలేదు.

మామ్ కొంచెం ఆగి 'వీరు ఒక రాజుగారి ఆస్థానంలో కవిత్వం చెప్పుకొని జీవించిన వ్యక్తివలె కన్పడటంలేదే' అన్నాడు, ఏదో అనుమానంతో.

కాళిదాసు చిరునవ్వు నవ్వి 'లేదు-వీరి ఆస్థానంలోనే ఎందరో కవిత్వం చెప్పుకొని జీవించారు' అని చెప్పారు.

'ఓహో! అలా చెప్పండి - అందుకే ఈ రాచఠీవి ప్రదర్శిస్తున్నాడీ పెద్ద మనిషి' అని మనస్సులో అనుకొని 'తమరే ప్రాంతం పాలించారు?' అని ప్రశ్నించారు.

'నేను విజయనగరం రాజధానిగా సమస్తాంధ్ర మహా సామ్రాజ్యాన్ని పరిపాలించాను.'

'ఓహో! విజయనగరం. నాకు తెలుసు- వైజాగ్ వెళ్ళాను నేను ఒక నావల్ వ్రాయడానికి ఇతివృత్తంకోసం-ఆ పక్కనే వుందికదూ విజయనగరం'

'అదికాదు - హంపీ విజయనగరం'

'అలాగా! కాని రాయలవారూ మీ ఆంధ్రదేశం ఇప్పుడు సర్వనాశనమై పోయిందండీ! తెలుగుభాషకూ, తెలుగువాడికీ మీ దేశంలో గౌరవమే లేదు సుమండీ.'

'నిజమా?'

'నూటికి నూరుపాళ్ళు నిజం! నామాట అసత్యమయితే ఒకసారి వెళ్ళి చూచి రావచ్చు'.

రాయలు తల ఆడించారు - మామ్ ముందుకు సాగిపోయాడు....

ఆ రాత్రి రాయలు ఆంధ్ర కవులందరికీ సమావేశానికి ఆహ్వానం పంపాడు. దాదాపు అందరూ వచ్చారు... అప్పుడు రాయలవారు ఇలా అన్నారు... 'ఇందాక మామ్ వచ్చి చెప్పినమాటతో నా హృదయం క్షోభించిపోయింది మన వారసులు ఇంత దౌర్భాగ్యులౌతారని నేను కలలో కూడా అనుకోలేదు... ఆంధ్రదేశంనుంచీ వస్తున్న వార్తలు చాలా దారుణంగా వున్నాయి.... మీకేమైనా విశేషాలు తెలిశాయా?'

'చిత్తం!' అన్ని నన్నయ్యగారు లేచి నిలబడి 'ఆంధ్రలో రెండు ముఠాలు తయారైనాయటండీ! ఒకరు నేను వాళ్ళ కులంవాణ్ణి కాబట్టి నేనే మహాకవినంటే, మరొకరు తిక్కన మా శాఖవాడు కాబట్టి ఈయనే మహాకవి కావాలి, అని కొట్టు కుంటున్నారటండీ! ఇక్కడ నాకూ తిక్కనకూ గల మైత్రి తమకు తెలిసిందే కదా! ఏమిటి అన్యాయం' అని విచారంగా తెలిపాడు నన్నయ్యగారు.

అనంతరం నాచనసోముడు లేచి "కృష్ణరాయా! నాకేమాత్రమూ గర్వం లేదు - నేనూ ఎఱ్ఱన్న ఎంత మిత్రులమో మీకు తెలుసు... కాని భూలోకంనుండి మొన్న కాటూరి వెంకటేశ్వరరాయ కవీంద్రుడు వచ్చి చెప్పాడు నాగుర్చి ఏమను కుంటున్నారో - నాకు విపరీతమైన గర్వమట.... ఆయనెవరో బయలుదేరి నేను కాఫీహోటలు ఉప్మాలాంటి వాడినని నన్ను అన్నాడట.... ఏమిటీ పోట్లాటలు చెప్పండి - ఎఱ్ఱనగొప్పా నేనుగొప్పా? అని కొట్టుకుంటున్నారట వారు.... దీని విషయం విచారించాలి మీరు....'

తర్వాత అప్పకవి లేచి ఆధునిక కవులు తనకు ద్రోహం చేస్తున్నారని విన్నవించుకున్నాడు - చిన్నయసూరి లేచి తనకొక చావువల్లకి కట్టి ఆధునికులు ఊరేగించినట్లుగా నాటకాలు వ్రాశారని మనవిచేశాడు - గిడుగు రామమూర్తిగారు లేచి నేను శుద్ధ సంప్రదాయక కుటుంబంలోనివాణ్ణి. నాకు రాజకీయాలు, పార్టీలు తెలియనే తెలియవు....కాని నాకూ, మా అప్పారావుకూ ఈ ఆధునికులు రంగులు పులిమి చిందులు వేస్తున్నారట.... ఏమిటీ ఘోరం" అని మనవి చేసుకున్నాడు. అప్పుడు కృష్ణరాయలవారు ఇలా అన్నారు.

"మిత్రులారా! మీ మీ కష్టసుఖాలన్నీ నాకు తెలిసినవే! కర్ణాకర్ణిగా విన్నవే లోగడ - కాని ఇప్పుడసలు తెలుగుభాష మొత్తానికే విపత్కరస్థితి వచ్చింది, ఇది ఏ ఒక్కరికీ చెందిందికాదు, అందరిదీనూ - తెలుగువాడికి తెలుగుదేశంలో బ్రతికి వుండగా గౌరవం లేకుండా మన తెలుగువాళ్ళే చేశారట! ఇది చాలా దురదృష్ట కరమైన విషయం.... దీనికి సంబంధించిన సమగ్రమైన నివేదిక నాకు కావాలి. ఎవరైనా ఆంధ్రదేశం వెళ్ళి సేకరించి తీసుకొని రావాలి.. "

"అందుకు మీరే సమర్థులు - తమరే వెళ్ళి ఒక్కసారి పరిశీలించి రావాలి" అని అందరూ ముక్తకంఠంతో కోరారు....

రాయలు ఒక్క క్షణం ఆలోచించి "సరే"నని ఆ బాధ్యత తన భుజ స్కందాలమీద వేసికొని భూలోకానికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు... అంత టితో ఆ సభ ముగిసింది.

మర్నాడు శ్రీకృష్ణరాయలవారు పాంచ భౌతిక దేహంతో ఆంధ్రదేశానికి దిగివచ్చారు.... అయితే ఆ కర్ణాభరణాలు లేవు....ఆ కుచ్చులతురాయి లేదు.... వజ్రపుటుంగరాలు లేవు. వీరోచితమైన ఖడ్గాదులు లేవు .. మామూలు పంచె, దానిపైన ఒక చొక్కాయి. ఆకుచెప్పులు.... అంతే!! వెంట వందిమాగధులూ' హంగుదారులూ, కాగడాపట్టేవారూ, వింజామరలు విసిరేవారూ ఎవరూలేరు.... ఒక్కడే నడుస్తూ ముందుకు సాగాడు ... ఓహో! ఎంతమారిందీ ప్రపంచం!! యంత్రాభివృద్ధి ఎంత జరిగిందీనాడు!! చివరకు యంత్రాలలో తానూ ఒక యంత్రంగా మారిపోయేవరకూ వెళ్ళాడే ఈ మానవుడు!! ఇలాగనుకుంటూ రాయలవారు నగరాన్నంతా పరిశీలించారు-రూపాయి పెట్టి ఒకచోట భోంచేశారు.... నిన్న కాచిన పులుసు, పాతగోంగూర, నీళ్ళమజ్జిగతో అన్నం పెట్టారు... ఓహో! కప్పురభోగి వంటకము, కమ్మని తాలి పుసొజ్జ పిండితో,

ఒక్కరూకకు భోజనం పెట్టేవారని మా శ్రీనాథుడన్నాడే, ఎంత దుర్గతి పట్టింది, ఈ దేశానికి!! అని విచారిస్తూ భోజనంచేసి బయటకు వచ్చాడు-

అక్కడేవున్న ఒక లైబ్రరీకి వెళ్ళి కొన్ని నెలల దినపత్రికలూ వారపత్రికలూ మాసపత్రికలూ తెప్పించుకొని చదివి వర్తమానాంధ్రదేశ సాహిత్య పరిస్థితులను కొంతవరకు అవగాహన చేసికొని ఆ విషయాలన్నీ నోట్సుగా వ్రాసుకున్నాడు... ఆ నాటి దినపత్రికలో ఒక ఉపన్యాసకునికి ఉద్యోగం ఖాళీగావుందనీ అప్లికేషను పెట్టుకోమనీ వుంది ... సరే - ఈ తెలుగువారి బ్రతుకులూ, తీరుతెన్నులూ పరిశీలిద్దామని అనాడే అప్లికేషను పెట్టాడు....

తాను చదివిన వ్యాసాలన్నీ చాలా విచిత్రంగా వున్నాయి - నన్నయ భారతము వ్రాసెనా? అని ఒక వ్యాసము. శ్రీకృష్ణదేవరాయలు ఏ దేశమువాడు; అని మరోవ్యాసం - ఆంధ్రశబ్ద చింతామణి ఎవరిది? అని వేరొక వ్యాసం. అష్టదిగ్గజాలెవరు? అని ఇంకొకవ్యాసం. "జాంబవతీ పరిణయమును వ్రాసిన అసలు కవి పేరు జాంబవంతుడు" అని వేరొక వ్యాసం - ఈ వ్యాసాల పరమార్థమేమిటో తెలియలేదు మన రాయలవారికి - రాయలవారికి కాదు. కృష్ణారావుకు- ఇంటర్వ్యూకు "కృష్ణారావు" అనే పేర అప్లికేషను పెట్టాడు - ఒక పత్రికలో "ముక్కు తిమ్మన్న ముక్కుపై పరిశోధనావ్యాసం సమర్పిస్తే పదివేల రూపాయలిస్తాము" రసమంజరి - కార్యదర్శి - అని వుంది- వెంటనే ఇదేదో చూదామని కృష్ణారావు రసమంజరి ఆఫీసుకు వెళ్ళాడు.

అక్కడొకాయన కూర్చొని వున్నాడు .. వెళ్ళి తనపేరు చెప్పి నేను సాహితీవేత్తను - దయచేసి ఆ ఋతువర్ణనలకు సంబంధించిన పోటీ వివరాలు చెప్పండి-" అని కోరాడు-

"మనదేవూరు?'

"ఈ వూరుమాత్రం కాదులెండి!"

"అది తెలుస్తూనేవుంది.... కొంచెం ఆగి మళ్ళీ చెప్పాడు".

"మంచిది - దానికి సంబంధించి ప్రస్తుతం ఏమీ లాభంలేదు". తేల్చివేశాడు కార్యాలయంలోని పెద్దమనిషి.

"అదేమిటండీ - ఆఖరు తేదీ ఇంకా అయిపోలేదు ?" కృష్ణారావు సంశయాత్ముడై ప్రశ్నించాడు .

ఆ పెద్దమనిషి చిరునవ్వు నవ్వాడు - ఆ నవ్వులో 'సంశయాత్మా వినశ్యతి' అనే అర్థం ధ్వనించినట్లుగా వుంది -

"చూడండి - మీ పేరేమిటన్నారు... ఆఁ! కృష్ణారావు గారూ ! ఆ ప్రైజు ఎవరికివ్వాలో మా కార్యదర్శి వాళ్లు నిర్ణయించారు -" అసలు రహస్యం చెప్పాడు పెద్దమనిషి

"అంటే ?"

"అంటే ఆ ప్రకటన అసలు ఒక మనిషిని మనసులో ఉంచుకొని చేయ బడ్డది - వారు ఎప్పుడో ఆ గ్రంథం వ్రాశారు - వ్రాశాకనే ఈ ప్రకటన -"

"ఇదేమి న్యాయం ! - ఒక వేళ అంతకన్న మంచి పుస్తకం వస్తే ?"

"వచ్చినా సరే - మా కోటిరెడ్డి గారి కాండిడేట్ వ్రాసిన పుస్తకమిది."

నవ్వాడు ఆ పెద్దమనిషి గడ్డం నిమురుకుంటూ

తల తిరిగిపోయింది కృష్ణారావుకు . ఆ పెద్దమనిషి మళ్ళీ నవ్వాడు. ఆ నవ్వులో చాలా భావాలు ఇమిడి వున్నాయి - అందులో అవహేళన వుంది - నిర్లక్ష్యం వుంది 'ఒరేయ్ అబ్బాయ్, కార్యదర్శికీ నాకూ పడదు కనుక రహస్యం చెప్పాను నీకు చేతనైందేదో చేసుకో' అన్న హెచ్చరిక వుంది....ఇన్ని భావా లను రంగరించి, సింగారించి నవ్విన ఆ నవ్వును జేబులో వేసుకొని కృష్ణారావు బయటపడ్డాడు -

రెండు రోజుల్లో ఇంటర్వ్యూ కార్డు వచ్చింది, ఈ లోపల ఆంధ్రభాష స్థితి గతులను గూర్చి "రాయల్ కమిటీ నివేదిక సిద్ధం చేశాడు - ఇక్కడ తెలుగూస్ అనే ఒక తెగ వున్నదనీ, వారు తెల్గు అనే భాష మాట్లాడితే అన్నం నీళ్ళు పుట్ట వనీ అందులో తెలియచేశాడు - ఇక్కడ బ్రతికినవారిని చచ్చే వరకూ నిమర్శిస్తా రనీ, చచ్చాక మాత్రం తాము బ్రతికిన పర్యంతం ప్రశంసిస్తూనే వుంటారనీ వ్రాశాడు - తెలుగు పాఠశాలలో తెలుగు ఇంగ్లీషువారూ. ఉర్దూవారు తప్ప తెలుగువారు నేర్చుకోరనీ వ్రాశాడు -

ఈ దేశంలో నేను భారతం చదవలేదు అంటే గౌరవం -

పెద్దవ ఎవరో మా బాబాయి కాబోలు-అని అంటే అతనికి మంత్రి పదవి ఇస్తారు-తెలుగుసంస్కృతంలోనుండి పుట్టలేదు అరణ్యంలోనుండిపుట్టిందిఅని బిర

ఉపన్యాసం ఇస్తే అతనికి 'అక్షరవైద్యుడు' అనే బిరుదు ఇస్తున్నారు - తెలుగువాడు పంచెకట్టరాదు కడితే వారికి ఉద్యోగంరాదు- మెడకొకగుడ్డ తాడు బిగించనిదేఉద్యోగానికి వెళ్ళకూడదట!" అని ఆ నివేదకలో వివరించాడు-ఇంటర్వ్యూరోజున ఉద్యోగార్థంకృష్ణారావు కళాశాలవెళ్ళాడు-కళాశాలవాతావరణం చూచేసరికి కృష్ణారావుకు దిగ్భ్రమ కలిగింది. ఎటు చూచినా జంటలే - విద్యార్థినీ విద్యార్థుల జంటలు .? ఉపన్యాసక స్త్రీ పురుషుల జంటలు... ఓహో ! ?

ఇదేమి సాందీపుని ఆశ్రమమా? లేక సౌందర్య ప్రదర్శనా రంగస్థలమా ? అనుకొన్నాడు కృష్ణారావు ..

నడుస్తున్న రాయలవారిని ఇద్దరమ్మాయిలు చూచారు హవాయి సాండల్స్ టెర్లిన్ దుస్తులు - రెండు జడలు ఒకామెకూ, గుజ్జుంతోక ఒకామెకూ ఉన్నది.

"ఏ మేవ్"

'ఆఁ'

"అచ్చం - బొమ్మల్లో వుండే శ్రీకృష్ణదేవరాయలలాగా వున్నాడే ?"

"ఔను ఆ నడక కూడా అదే ! తానే రాయలననుకొని నడుస్తున్నట్లున్నాడు."

మొదటమ్మాయి ఏమిటో అంది - ఆ మాటకు రెండవ అమ్మాయి చప్పట్లు కొట్టి 'హిప్ - హిప్ - హుర్రే' అని అరిచింది....

మన కృష్ణారావు వెనుదిరిగి చూచాడు - వాళ్ళిద్దరూ విరగబడి నవ్వుతున్నారు - వీళ్ళెవరు ? పుష్పలావికలా ? తన రాజధానిలో వీధిలో పూలమ్మే పిల్లలు కూడా ఇలాలేరే ! ! ఎవరో వీళ్ళు ! ! ఇదేదో ప్రత్యేకమైన రకంలా గుంది........

చూస్తూండగానే ఒక స్కూటర్‌పై నుండి సూటువాలా దిగాడు. దాని వెనుక ఒక పంజాబీదుస్తులపిల్ల దిగింది "ఓహో ! కళాపూర్ణోదయ కథలోని మణికంధరుడా వీడు - ఈ 'వాహనమేమి ? సింహమా ? ? ఆమె ఎవరు ? కలభాషిణి కాదుకదా ?' - గ్రాంథికంలోనే ఆలోచించ సాగాడు కృష్ణారావు.... చూస్తూండగానే ఒక బస్సు శకుంతలలు దిగారు - వారి వెనుక మరొక బస్సు దుష్యంతులూ వెంట నడిచారు. అందరి చేతులలోనూ లావుపాటి పుస్తకాలు.... అన్ని కాళ్ళూ విజ్ఞానదీప నిలయమైన ఆ విద్యాలయంలోకే నడుస్తున్నాయి....

అందరూ ఆంగ్లంలోనే మాట్లాడుతున్నారు....తెలుగు ఎవరికీ రాదేమో పాపం, అనుకున్నాడు కృష్ణారావు.

ఒకామె తన స్నేహితుణ్ణి కలుసుకున్నది గొట్టాంలాగు వేసుకున్న అతడంటున్నాడు "నిన్న నీకోసం మ్యాట్నీకి బాక్సు టిక్కెట్లు రిజర్వు చేసి కూర్చున్నాను .. కాని రాలేదేం"

ఆమె నవ్వి క్రింది పెదవి కొరికి అంది "దిల్ దియా దర్దలియా"

అతడన్నాడు "ఔను, ఆ హాలువద్దనే నిలబడ్డాను నీకోసం" అని -

కృష్ణారావు మెట్లెక్కి లోనికి వెళ్ళాడు - ఇంటర్వ్యూ జరిపే గది బయట వరుసగా అభ్యర్థులొక బల్లపైన కూర్చున్నారు. తానూ వాళ్ళ ప్రక్కన కూర్చున్నాడు. మెల్లగా ప్రక్కన వున్న వాణ్ణి పరిచయం చేసుకున్నాడు. ఆయన పేరు వెంకట్రావు. వెంకట్రావు కృష్ణారావును చూచి "అయితే మీరూ ఉద్యోగానికే వచ్చారా ?" అని ప్రశ్నించాడు.

"అవును" అన్నాడు కృష్ణారావు.

"అయితే మీరెవరు ?"

"ఏమిటి ?" కృష్ణారావు ప్రశ్నించాడు.

'అదేనండీ ! మీరెవరితరపు ?'

'అంటే ?'

వెంకట్రావు కోపంతో కూడిన నవ్వు నవ్వి 'పోనీలెండి' అన్నాడు -

'ఏమిటి, పోనీలెండి ?" అన్నాడు కృష్ణారావు

"మీకు చెప్పడం ఇష్టంలేకపోతే పోనీలెండి'

"అసలు మీరడిగిన ప్రశ్న నాకర్థముకాలేదు స్వామీ" సవినయంగా కృష్ణారావు జవాబిచ్చాడు.

"మీరెవరి కాండిడేట్ అని నా ప్రశ్న! అంటే కూడా అర్థంకాలేదా?- మిమ్మల్ని ఏ మంత్రిగారు బలపరుస్తున్నారు, అని అడుగుతున్నాను."

"నన్ను ఏ మంత్రీ ఎరగడే" అన్నాడు కృష్ణారావు.

"పోనీ! ఈ ప్రిన్సిపాల్"

"లేదు"

"డిపార్టుమెంటల్ హెడ్"

"లేదు"

"మరెందుకు వచ్చినట్లు ఇంటర్వ్యూకు?"

"రాకూడదా?" కృష్ణారావు అమాయికంగా అడిగాడు.

నవ్వాడు వెంకట్రావు- "చాదస్తుడా!" అని తిట్టినట్లుంది ఆ నవ్వు. "వచ్చి ప్రయోజనమేమిటి?...." కొంచెం ఆగి మళ్ళీ వెంకట్రావే అన్నాడు "మీకు క్వాలిఫికేషను ఉందా లేదా అన్నది మాకు అనవసరం, మీరు రూల్సుకు అనుగుణంగా అప్లయ్‌చేశారా, ప్రతికూలంగా అప్లయ్‌చేశారా అన్నది మా కక్కరలేదు - మీరు బాగా పాఠంచెప్పి క్లాసు కంట్రోలు చెయ్యగలరా?లేదా, అన్నది మేముచూడము. మాలా మిమ్మల్ని ఎవరైనా రికమండ్ చేస్తున్నారా లేదా అన్నదే ముఖ్యం - లేకుంటే ఉద్యోగానికి అప్లికేషను పెట్టడం శుద్ధ దండుగ-ఇదీ పాలసీ" నవ్వుతూ అన్నాడు వెంకట్రావు.

కృష్ణారావు కొంచెం ఆలోచించి "అయితే ఈ వ్యవస్థ ఇలా సాగవలసిందేనా? యోగ్యులైన విద్యావంతులు వచ్చినా-"

వారిగతి "నిర్గతే" వెంకట్రావు జవాబుచెప్పాడు.

కృష్ణారావు ఆశ్చర్యపోయాడు- "మరి ఇలాగయితే ఆ విద్యా,ఉద్యోగాలు, ఇంటర్వ్యూలు, ఈ తంతులన్నీ ఎందుకు? కావలసినవాణ్ణి పిలిచి హాయిగా ఉద్యోగం ఇవ్వవచ్చునే - ఎవరు వద్దన్నారు? - ఈ నాటకమంతా ఎందుకు?"

కృష్ణారావు ఆలోచిస్తూకూర్చున్నాడు - ప్రపంచ స్వరూపం ఆయనకు అవగతం కాలేదు - పాపం ఎందుకు ఇలా బలి ఐపోతున్నారో? -

కృష్ణారావుమాట్లాడకుండా కూర్చున్నాడు.

వెంకట్రావును పిలిచారు; వెళ్ళాడు.

అనంతరం కృష్ణారావును - బెల్ మ్రోగింది. ప్యూన్ "శ్రీ కృష్ణారావు" అని పిలిచాడు-

మూరురాయర గండ, సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణ ప్రభువు, ఆ భూషలులేకున్నా, అ పాత ఠీవితోనే లోనికి ప్రవేశించాడు.

కృష్ణారావు చేతులెత్తి నమస్కరించాడు. ఎదురుగా వున్నవారెవరూ ప్రతినమస్కారం చేయలేదు - కృష్ణారావుకు ఆత్మాభిమానం దెబ్బతిన్నది - అయినా... తానిప్పుడు ఉద్యోగానికి అభ్యర్థిగా నాటకం ఆడుతున్నాడు - ఈ నాటకం పరిధిలో మఱి, తన ఎదుట వున్నవారే మహాఘనులు; ఓర్పుతో వెళ్ళి కృష్ణారావు కుర్చీలో కూర్చున్నాడు. చుట్టూ ఒక్కసారి కలియచూచాడు... ఎదురుగా నలుగురు కూర్చొనివున్నారు - తేలికగానే వారెవరో పోల్చుకున్నాడు

ఒకాయన సన్నగా పొడుగుగా వున్నాడు. కాటన్ సూట్ వేసుకున్నాడు. తనంతట తాను మానసికంగా అనుభూతి చెందిన న్యూనతను కప్పిపుచ్చుకోవడం కోసం ధరించిన కాటన్ సూటు అది - కాటన్ డ్రై - పూచికపుల్ల వంటి కాళ్ళూ, చేతులూ ఎఱ్ఱటి పొడుగైన ముఖం, లోతుకు పీక్కుపోయిన దవడలు గుంట కళ్లు - ఈయన ముందున్న తెలుగు పుస్తకాలను బట్టి తెలుగు ప్రధానాచార్యుడని ఊహించాడు. ఆ ప్రక్కనే మరొక వ్యక్తి వున్నాడు - మధ్యలో కూర్చొని వున్నాడు కాబట్టి ప్రిన్స్‌పాల్, అని గమనించాడు - ఆ ప్రక్కనే వున్న మరో వ్యక్తి కమిటీకి సంబంధించిన పెద్ద అయి వుండాలని భావించాడు - ఆయన కొంచెం మొరటుగా వున్నాడు, బహుశా రాజకీయవేత్త కాబోలు....

కృష్ణరాయలు చిరునవ్వు నవ్వుతూ వారిని ఆ నవ్వుతోనే పలకరించినంత పని చేశాడు -

మధ్యనున్న ప్రిన్స్‌పాల్ ఇలా అన్నాడు.

'నీ పేరేమిటి ?'

'అదేనండీ ! మీ చేతిలోని అప్లికేషన్ ఫారంలో వున్నదే !'

'వాట్ ! !' అని నోట్లోని మ్మాక్రోఫోలో చుట్టను చేతిలోకి తీసుకొని ఒక సారి సూటిగా చూచి మూతి విరుచుకొని తెలుగు హెడ్ వైపు చూచి 'ప్రొసీడ్' అన్నాడు. ఆ ప్రొసీడ్ అన్న మాటను, త్వరగా తేల్చెయ్' అన్న ధ్వనిలో ఉచ్చరించాడు.

కృష్ణారావు నవ్వుకున్నాడు....

తెలుగు హెడ్ ప్రశ్న ప్రారంభించాడు.

'యూసీ మిస్టర్, వాట్ ఈజ్ యువర్ ఒపీనియన్ ఎబౌట్'....

మాట మధ్యలోనే కృష్ణారావు అందుకొని 'ఇది ఆంధ్రదేశం, మీరు ఆంధ్రులు - నేనూ పదహారణాల ఆంధ్రుణ్ణి - ఇది తెలుగు భాష బోధించే వాని కొఱకు జరుపుతున్న ఇంటర్వ్యూ - తమరు ఇంటర్వ్యూను తెలుగులోనే జరపడం ఔచిత్యమనిపించుకుంటుంది' అన్నాడు - తెలుగు హెడ్ దిమ్మరపోయాడు - ఇతనెవరో పోట్లాడడానికి వచ్చాడుకాని ఉద్యోగానికి రాలేదని భావించాడు. ఒక్క నిముషం మౌనం వహించాడు....

'ప్రొసీడ్ - ప్రొసీడ్' ప్రిన్స్‌పాల్ హెచ్చరిక - సరేనని తెలుగు హెడ్ బుర్ర ఆడించి 'ఆముక్తమాల్యద కర్తృత్వంపై మీ అభిప్రాయం ఏమిటి ?' అని ప్రశ్నించాడు -

'అంటే ?' కృష్ణారావు ఎదురు ప్రశ్న వేశాడు.

'అంటే అంటారేమిటి ? - ఆముక్తమాల్యద కర్తృత్వమనే వ్యాసంకూరా మీరు చదువుకోలేదా ?'

'అబ్బే ! చదువుకోలేదు ...'

'అయితే ఇక చర్చ అనవసరం'

కృష్ణారావుకు కోపం వచ్చింది 'అవసరమే - అసలు విషయమేమిటో చెప్పండి'

'విషయమంటావేమిటయ్యా ! ఉద్యోగానికి వచ్చావు, ఆముక్తమాల్యద ఎవరు వ్రాశారో తెలియదు ?'

'అయితే ఎవరు వ్రాశారు ?'

'ఆముక్తమాల్యద నేను వ్రాశాను' కృష్ణారావు సూటిగా జవాబిచ్చాడు.

తెలుగు హెడ్ ఈ వచ్చినతనికి పిచ్చివుందేమోనని అనుమానించడం ప్రారంభించాడు.

'నువ్వు వ్రాస్తే మంచిదే - ఇప్పుడు నేనడిగింది ఆముక్తమాల్యద రాయలు వ్రాశారా లేక ... '

'లేక ?' కృష్ణారావులో కోపం ద్విగుణీకృతమవుతోంది.

'.... లేక పెద్దనామాత్యులు వ్రాశారా ?'

'లక్షింపతిగారూ ! ఏమిటది ? ఎందుకు వాఙ్మయానికింత ద్రోహం చేస్తారు ?'

ప్రిన్సిపాల్, ఇంటర్వ్యూలో కృష్ణారావు ప్రవర్తనకప్పుడే మార్కులు వేశాడు -

లక్షింపతి కోపంగా 'ఏమిటయ్యా నువ్వనేది ?' అన్నాడు -

'ఆముక్తమాల్యద సాహిత్య సమరాంగణ సార్వభౌముని చేత వ్రాయబడింది - ఇందులో మీకనుమానమేమిటో నాకర్థంకావడంలేదు -'

'మిస్టర్ ! ఈ మాట కృష్ణారావుకాదు, సాక్షాత్తూ శ్రీకృష్ణదేవరాయలు వచ్చి తీర్పు చెప్పినా మేము నమ్మము.'

'మరి మీరు ఎలా నమ్ముతారు ?'

'పరిశోధనలబట్టి నమ్ముతాము - తాటాకులను నమ్ముతాము. రాతి శాసనాలను నమ్ముతాము'

కృష్ణారావుకు పరమేశ్వరుడు జ్ఞాపకానికి వచ్చాడు. సజీవమైన మనిషిని వారు నమ్మరు - రాయలు వచ్చి ఆ పుస్తకం నేను వ్రాశానని చెప్పినా నమ్మరు, రాళ్ళనూ, ఆకులనూ నమ్ముతారట !

'మంచిది ఇంటర్వ్యూ కానీయండి - '

లక్షింపతి ఒక పద్యమిచ్చి అందలి విశేషాలు చెప్పమన్నాడు. అది పష్ఠ చిత్రీయంలో పురవర్ణనలోనిది - కృష్ణారావు విశేషాలు వివరించాడు - లక్షింపతి చప్పరించాడు .. ప్రిన్సిపాల్ లక్షింపతి వైపుకు తిరిగి

'ఏమి తప్పు చెప్పాడా ?'

'ఔనండీ !' అన్నాడు లక్షింపతి.

కృష్ణారావు కోపాన్ని దిగమింగి 'నేను చెప్పినవి తప్పా ? అయితే ఒ ప్పేమిటో చెప్పండి.'

లక్షింపతి కొన్ని కొన్ని పదాలకు కొన్ని కొన్ని అర్థాలు చెప్పాడు -

కృష్ణారావు 'ఆ అర్థాలు తప్పు - మీ పాండిత్య దుర్విదగ్ధతతో లేనివి లాగుతున్నారు -' అన్నాడు -

'ఆ మాట అనడానికి నీవెవరవు ?"

"నేను సాక్షాత్తూ ..." అని నాలిక కరుచుకున్నాడు కృష్ణారావు -

"ఫరవాలేదు - అను నాయనా ! నేనే శ్రీకృష్ణదేవరాయలను" అను - అని ఇటు ప్రిన్సిపాల్ వైపు తిరిగి 'సార్ ! ఈ మాటలకు మహా విద్వాంసుడైన మా వ్యాఖ్యానకారుడు ఇలా వ్రాశాడు అందుకని వీటి అర్థం ఇదే ..."

'అతను కాదంటాడేమిటి ?' ప్రిన్సిపాల్ ప్రశ్నించాడు -

'పోనీలెండి, పాపం - ఇంటర్వ్యూకు వచ్చినవాడు అలాకాక ఇంకెలా దబాయిస్తాడు -"

ఈ విషయంలో ఇంకెవరూ ప్రామాణికులుకారా ?" ప్రిన్సిపాల్ ప్రశ్న !

'కారండీ ! సాక్షాత్తూ రాయలు వచ్చినాసరే మనకు ప్రామాణికుడు కాడు. దీని అర్థం మా పండితులెలా నిర్ణయించారో అదే ప్రమాణం.'

'పరమాత్మా ! శ్రీరంగేశ్వరా! ఎక్కడున్నావు తండ్రీ !' అనుకున్నాడు రాయలవారు -

'ఆ త్వరగా ముగించండి' ప్రిన్సిపాల్ తొందర పెడుతున్నాడు - తరువాత పెద్దననుండి ఒక ప్రయోగం ఇచ్చి దీనిని సాధించమన్నాడు లక్షింపతి .

కృష్ణారావు లక్షింపతి ముఖంలోకి అలాగే చూస్తూ కూర్చున్నాడు ....... లక్షింపతి ఎగతాళిగా ఒక విషపు నవ్వు నవ్వి 'ఏమి తెలియలేదా ?'

"ఔను - మీ మందబుద్ధికి కారణమేమిటో నాకు తెలియదు -" అన్నాడు కృష్ణారావు.

ప్రిన్స్‌పాల్‌కు కోపం వచ్చింది. ప్యూన్ చేత బయటకు గెంటిద్దామని కృష్ణారావు ముఖం చూచాడు - కృష్ణారావు పిడికిలి బిగించి సాహితీసమరాంగణ సార్వభౌముడై కూర్చొని వున్నాడు. దానితో భయంవేసి అలాగే కూర్చున్నాడు ప్రిన్స్‌పాల్.

లక్షింపతి 'చూడు బాబూ ! నీవు ఇంటర్వ్యూకేనా వచ్చింది ?' అని ప్రశ్నించాడు -

'చూడు పంతులుగారూ ! మీరు తెలుగు భాషకేనా ఉపాధ్యాయులు?' అని ఎదురు ప్రశ్న వేశాడు....

'అంటే నీ ఉద్దేశ్యం !' గుర్ గుర్ మన్నాడు లక్షింపతి -

'అసలా పదం తప్పు - ఇదీ సరియైన రూపం' మరొక రూపం ఇచ్చాడు కృష్ణారావు .

"నీవిచ్చింది పాఠాంతరం - పాఠాంతర చక్రవర్తులైన మా పండితులిచ్చిన పరిష్కారం, నేనిచ్చిన రూపమే" లక్షింపతి ధీమాగా చెప్పాడు -

"నేను స్వయంగా చెపుతున్నానయ్యా పంతులూ - నీవు చెప్పేది తప్పు. కావాలంటే పెద్దనచేత సాక్ష్యమిప్పిస్తాను కృష్ణారావు కోపంగా అన్నాడు -

"పెద్దన కాదు పరమేశ్వరుడు నేలకు దిగివచ్చి చెప్పినా సరే మా రీసెర్చి ప్రాజెక్టులో నిర్ణయించిన రూపమే కరెక్టు ..."

కృష్ణారావు రెండు చేతులెత్తి లక్షింపతికి నమస్కారం చేశాడు "స్వామీ ! లక్షింపతి గారూ - మీరీ ఆంధ్రభాష నుద్ధరించడానికి కంకణం కట్టుకున్న అపర వాణీధవులు.... పెద్దన్న రూపాలు పెద్దన్నకంటే తమకే ఎక్కువ తెలుసు - రాయలవారి, కవిత్వం రాయలకన్నా కూడా మీకే ఎక్కువగా తెలుసు - మీబోటి వారు జన్మించడం మా పురాకృత కర్మ విశేషం - ఆంధ్రభూమి జన్మజన్మాల తపఃఫలితం...."

లక్షింపతి "నేనింక అడగవలసినదేమీలేదు" అన్నాడు ముఖం అదోలా పెట్టుకొని .

ప్రిన్సిపాల్ "మంచిది మీకు టీచింగ్ ఎక్స్పీరియన్స్ ఏమయినా వుందా?' అన్నాడు -

"అంటే - తెలుగులో చెప్పండి" -

"బోధనానుభవం...."

"వున్నది"

'ఎన్నాళ్ళు'

'ముప్ఫై సంవత్సరాలు'

"ఎవరికి బోధించారు? " "మహాకవులకు బోధించాను . ముక్కోటి ఆంధ్రులకు బోధించాను ."

"మంచిది - ఇకనేమీ అడగను" ప్రిన్సిపాల్ మూతి విరుచుకొని అన్నాడు ...

కమిటీ పెద్ద గొంతు సవరించుకొని "సరే! ఆ విషయాలకేమిగాని, మీరు ఎంత పండితులో నాకు తెలియదు ... మీమీ పాండిత్యాలతో నాకు పనిలేదు ... నాకు కావలసిందల్లా సంస్థ అభివృద్ధి...."

"అదేమిటండీ! పాండిత్యంతో సంబంధం లేకుండా సంస్థ అభివృద్ధి ఏమిటి?"

"అదే చెబుతున్నా విను ... విద్యాలయానికి మీరొక 10 వేలు విరాళ మివ్వాలి లేదా ఎవరిచేతనైనా ఇప్పించాలి - అదీ లేకపోతే అలా విరాళమివ్వ గల విద్యార్థులను నీవు స్వయంగా తెచ్చి చేర్పించాలి ఈ పని చెయ్యగలవా?"

"చేయలేకపోతే?"

"చేయలేకపోతే, అది చేసేవారికి ఉద్యోగమిస్తామని అర్థం"

"అయితే ఈ దొంగ ఇంటర్వ్యూలెందుకు?"

"ఫార్మాలటీ సేక్"

"మీరు పత్రికలో ఇలా డబ్బు యిచ్చినవారికే ఉద్యోగం ఇస్తామని ప్రకటన చేసినట్లు లేదు...."

"చాదస్తుడా! ఇంక వెళ్లు"

"ఇంటర్వ్యూ అయిపోయినట్లేనా? " కృష్ణారావు మళ్ళీ ప్రశ్నించాడు. వారు జవాబుకూడా ఇవ్వలేదు.

ప్రిన్సిపాల్ బెల్ కొట్టాడు

ప్యూన్ మరొకరి పేరు కేకవేశాడు. కృష్ణారావు సంగ్రహ నివేదిక పూర్తి అయింది.

వరుసలో కూర్చొని వున్న మరొక అభ్యర్థి పంచె, పిలక సవరించుకుంటూ లోనికివచ్చాడు. అతనికి తెలియదు, సూట్ లేనిదే ఉద్యోగం రాదని.

'వైన' తేముద్రైన ప్రిన్సిపాల్ సిగరెట్ వెల్గించి, నిత్యాగ్నిహోత్రుడై "కృష్ణారావు! నీవిక బయటకు వెళ్లు" బెదిరించినట్లు చెప్పాడు.

కాని వెళ్ళేందుకు అక్కడ ఎవరున్నారు? ఏదీకృష్ణారావు ఆత్మ!

ఇంటర్వ్యూలో కృష్ణారావు, చచ్చి అప్పుడే స్వర్గానికి చేరాడని వాళ్ళకింకా తెలియదు.